## క్లుప్తంగా

### సీఎంకు వినతి

ఖమ్మం మామిళ్లగూడెం: ముస్లిం సమస్యలపై జేయూహెచ్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు మౌలానాసాయిద్ అహ్మద్ ఖాస్మీ ఆధ్వర్యాన ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ముస్లింల అభివృద్ధి విద్యా, ఉద్యోగ, ఉపాధితోనే సాధ్యమని, 2004లో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన 4 శాతం రిజర్వేషన్ అమలయ్యేందుకు కృషి చేయాలని కోరారు. గత పదేళ్లుగా వక్ఫ్ బోర్డుకు సంబంధించిన విలువైన భూములను నాటి ప్రభుత్వం అనేక మంది పెద్దలకు ధారాదత్తం చేసిందని, వాటిపై విచారణ జరిపించి తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వినతి అందించిన వారిలో రాష్ట్ర నాయకులు హాఫీజ్‌లు పీర్‌షబ్బీర్ అహ్మద్, పీర్ ఖలీఫ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

### సమస్యలు పరిష్కరించాలి

నేలకొండపల్లి: దివ్యాంగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను వెంటనే పరిష్కరించాలని దివ్యాంగుల జేఏసీ చైర్మన్ పీ.వీ.చలమయ్య అన్నారు. ఆదివారం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతి పత్రం అందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. దివ్యాంగులకు పెన్షన్ సకాలంలో అందేలా చూడాలని, ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. తమకు ఇచ్చే రుణాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా ఇవ్వాలని కోరారు. ఆయన వెంట సంఘం నాయకుడు బి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### కఠిన చర్యలు తీసుకోండి

ఖమ్మంరూరల్: మండలంలోని రాజీవ్ స్వగృహ వద్ద ఉన్న ఎన్‌టీఆర్ విగ్రహాన్ని కొందరు ధ్వంసం చేయడం హేయమైన చర్య అని బీఆర్‌ఎస్ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు చింత నిప్పు లాలయ్య ఆదివారం రాత్రి ఓ ప్రకటనలో ఖండించారు. తెలుగు వారి ఆత్మగౌరవాన్ని దశదిశలా వ్యాప్తి చేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన ఎన్‌టీఆర్ విగ్రహాన్ని తిరిగి యథావిధిగా ప్రతిష్ఠించాలని తెలిపారు.

### ఉచిత టైలరింగ్‌పై శిక్షణ

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని త్రీటౌన్ పంపింగ్ వెల్‌రోడ్ వడ్డెర కాలనీలో సత్యమార్గం యూత్ సర్వీస్ సొసైటీ, నగర వడ్డెర సంఘం ఆధ్వర్యాన ఉచితంగా టైలరింగ్‌పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. 45 రోజుల పాటు సాగిన ఈ శిక్షణ ముగింపు సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నిర్వాహకులు మాట్లాడుతూ.. మహిళా సాధికారత సాధించటమే లక్ష్యంగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. టైలరింగ్‌తో పాటు బ్యూటీషియన్, జ్యూట్ బ్యాగులు, అగరొత్తుల తయారీ వంటి కోర్సులపై కూడా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యమార్గం యూత్ సీస్ సొసైటీ ప్రెసిడెంట్ ఎస్.లక్ష్మి, జిల్లా చైల్డ్ ప్రొటక్షన్ కో–ఆర్డినేటర్ కె.శ్రీనివాస్, ఎస్.నగేశ్, వడ్డెర సంఘం కార్యదర్శి వేముల వీరయ్య, వల్లెపు సైదులు, కొండలు, ఉపేందర్, శ్రీను, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

### ట్రై సైకిల్ పంపిణీ

రఘునాథపాలెం: మండలంలోని చిమ్మపుడి గ్రామంలో డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ సహకారంతో గ్రామానికి చెందిన చినబోయిన వెంకన్న, సతీశ్, సైదులు అనే దివ్యాంగులకు ఆదివారం ఉచితంగా ట్రైసైకిళ్లు పంపిణీ చేసినట్లు డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు చింతల రమేశ్ తెలిపారు. సేవాకార్యక్రమంలో భాగంగా ఈ వితరణ చేసినట్లు రమేశ్ చెప్పారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు దొంతు గణేశ్, గుండ్ల గోవర్ధన్, పెద్ది నాగరాజు, జోనేబోయిన నవీన్, వెంకటేశ్, పవన్ పాల్గొన్నారు.

### 'హనుమాన్'ను వీక్షించిన తలసేమియా చిన్నారులు

ఖమ్మంగాంధీచౌక్/ఖమ్మంవైద్యవిభాగం: తలసేమియా చిన్నారులు ఆదివారం నగరంలోని ఓ థియేటర్‌లో హనుమాన్ సినిమాను ఉచితంగా వీక్షించారు. అమెరికాలో స్థిరపడిన ప్రియాంక దంపతుల ఆర్థిక సహకారంతో సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ వారు తలసేమియా చిన్నారులకు ఈ సినిమాను చూపించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు అనిత, రవిచందర్, వైద్యులు నారాయణమూర్తి పాల్గొన్నారు.

### నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు

కామేపల్లి: కొత్తలింగాల గ్రామంలోని శ్రీకోట మైసమ్మతల్లి దేవాలయ పునర్నిర్మాణానికి దాతల నుంచి సేకరించిన విరాళాలను దుర్వినియోగం చేశారని సింగరేణి గ్రామవాసి వాసిరెడ్డి సంపత్‌కుమార్ ఆదివారం ఖమ్మం దేవాదాయ, ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. గతేడాది మర్రిగూడెం గ్రామానికి చెందిన దిరిశాల నరేశ్‌చౌదరి రూ.5 లక్షల చెక్కును ఆలయ చైర్మన్ మల్లెంపాటి శ్రీనివాసరావుకు ఇస్తే.. దానిని బ్యాంకులో జమచేయకుండా దుర్వినియోగం చేశారని, అధికారులు విచారణ చేపట్టి డబ్బును రికవరీ చేయాలని సంపత్‌కుమార్ కోరారు.

### పరామర్శ

ఖమ్మం మామిళ్లగూడెం: బోనకల్ మండలం బ్రిడ్జిపై ఆటో బోల్తా పడిన ఘటనలో గాయపడిన క్షతగాత్రులను బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ జిల్లా ఆస్పత్రిలో ఆదివారం రాత్రి పరామర్శించారు. ఆయన వెంట రావినూతన సర్పంచ్ కామినేని ఉపేందర్, బీజేపీ నాయకులు శ్యామ్‌రాథోడ్, వీరభద్రం, తదితరులు ఉన్నారు.

# పల్లెల్లో ప్రత్యేక పాలన!



పదవీ కాలం ముగిసిన నేలకొండపల్లి మండలంలోని సర్పంచ్‌లు



ప్రత్యేకాధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓను సన్మానిస్తున్న గ్రామస్తులు

**సర్పంచ్‌లకు సెలవు.. అధికారుల కొలువు..**

- గ్రామాభివృద్ధిలో ప్రత్యేక ముద్ర చూపిన సర్పంచ్‌లు
- ఎన్నికల నిర్వహణ జాప్యంతో తప్పని ప్రత్యేక పాలన
- ఒక్కో ప్రత్యేకాధికారికి ఐదారు పంచాయతీల చొప్పున అప్పగింత
- డిజిటల్ కీలు స్వాధీనం చేసుకున్న అధికారులు

నేలకొండపల్లి: సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో ఆయా నియోజకవర్గాల్లోని గ్రామ పంచాయతీలు ప్రత్యేక పాలనలో కొనసాగుతున్నాయి. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు జాప్యం చేయడంతో ప్రత్యేక పాలన తప్పని సరైంది. పంచాయతీరాజ్ అధికారుల ఆదేశాల మేరకు పంచాయతీలలో ప్రత్యేకాధికారులుగా బాధ్యతలు స్వీకరించారు. వీరి పాలనలో చేపట్టాల్సిన విధులు ఎలా ఉండాలో అవగాహన కల్పించనున్నారు.

**డిజిటల్ కీలు స్వాధీనం..**

ప్రభుత్వం ప్రత్యేకాధికారుల పాలనను తీసుకురావడంతో ఇప్పటివరకు వినియోగించిన డిజిటల్ కీలను సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు నుంచి ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వాధీనం చేసుకున్నారు. ఈనేపథ్యాన పాలేరు నియోజకవర్గంలో చాలా చోట్ల డిజిటల్ కీలు అధికారుల చేతిలోనే ఉన్నాయి. ఇప్పటి వరకు సర్పంచ్, ఉప సర్పంచ్‌లకు ఉన్న చెక్ పవర్ ఇక నుంచి పంచాయతీ కార్యదర్శి, ప్రత్యేకాధికారులకు జాయింట్ చెక్ పవర్‌ను కల్పించి నిధులు డ్రా చేసే విధంగా కసరత్తు ప్రారంభించారు.

**ఒక్కో అధికారికి ఐదారు పంచాయతీలు..**

పాలేరు డివిజన్‌లో ప్రత్యేకాధికారులుగా ఎంపీడీఓ, మండల పంచాయతీ అధికారులు, తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, మండల వ్యవసాయాధికారులు, ఇంజనీరింగ్ అధికారులు, గెజిటెడ్ హోదా కలిగిన అధికారులకు బాధ్యతలు అప్పగించారు. ఒక్కొక్కరికి ఐదు లేదా ఆరు పంచాయతీల చొప్పున పాలేరు నియోజకవర్గంలోని మొత్తం 114 పంచాయతీలను అప్పగించారు.

**గ్రామాభివృద్ధిలో ప్రత్యేక ముద్ర..**

పంచాయతీలను అభివృద్ధి చేయడంలో సర్పంచ్‌లు కీలకంగా పని చేశారు. మునుపెన్నడూ లేని విధంగా గ్రామాల్లో వైకుంఠ ధామం, పంచాయతీ ట్రాక్టర్ కొనుగోలు, డంపింగ్ యార్డ్, పల్లె ప్రకృతి వనం, మౌలిక వసతులు, పారిశుద్ధ్యం కోసం మల్టీపర్పస్ సిబ్బంది లాంటి స్థిరంగా గుర్తుండే అనేక పనులు చేసి వారి పాలన ప్రత్యేక ముద్రను వేసుకున్నారు. ఐదేళ్లలో మంచి గుర్తింపు పొందినట్లు సర్పంచ్‌లు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**ఐదేళ్ల పాలన సంతృప్తినిచ్చింది..**



ఐదేళ్ల పాటు ప్రజలకు సేవలందించడం సంతోషంగా ఉంది. ఎన్నికైన నాటి నుంచి గ్రామాభివృద్ధికి కృషి చేశాం. పాలన చాలా సంతృప్తిగా ఉంది. గ్రామంలో ప్రత్యేక శ్రద్ధతో అనేక అభివృద్ధి పనులు చేశాం. మా గ్రామంలో కాలువపై వంతెన నిర్మాణం జీవితంలో మరిచిపోలేను.

– గండు సతీశ్, తాజా మాజీ సర్పంచ్, అమ్మగూడెం

**బిల్లులు చెల్లించేలా చూడాలి..**



గ్రామాభివృద్ధి కోసం చేసిన పనులకు సంబంధించిన బిల్లులను వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలి. సర్పంచ్‌లకు అప్పుడే నిజమైన గౌరవం దక్కుతుంది. పంచాయతీలలో చేసిన అభివృద్ధి పనులలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు, గ్రామస్తులు, సిబ్బంది సహకారం అందించారు.

– పెంటమళ్ల పుల్లమ్మ, తాజా మాజీ సర్పంచ్, కోనాయిగూడెం

**ప్రత్యేకాధికారులకు సహకరించాలి..**



సర్పంచ్‌లు పదవీ కాలం ముగిసినప్పటికీ ప్రత్యేకాధికారుల పాలనకు సహకరించాలి. పదవికే గడువు ముగిసింది కానీ ప్రజల సేవకు కాదు. అన్ని పంచాయతీ ప్రత్యేకాధికారులకు ప్రజలు సహకరిస్తేనే గ్రామాభివృద్ధి జరుగుతుంది. ప్రభుత్వం ఆదేశాలను ప్రత్యేకాధికారులు తప్పకుండా అమలు చేయాల్సిందే.

– కె.జమలారెడ్డి, ఎంపీడీఓ, నేలకొండపల్లి

## ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటాం..

కామేపల్లి: కాంగ్రెస్ పార్టీ గెలుపునకు పని చేసిన ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటామని పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబురు దయాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం పండితాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలపై అక్రమంగా కేసులు పెట్టారని, అటువంటి వారికి తగిన సమయంలో బుద్ధి చెబుతామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్, మేకపోతుల మహేశ్‌గౌడ్, బానోత్ నరసింహానాయక్, గింజల నర్సింహారెడ్డి, ఏపూరి మహేందర్‌కుమార్, ఫత్తేమహ్మద్, బండి ఉపేందర్, తొండల ముత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దయాకర్‌రెడ్డి

### బ్రాహ్మణ సేవా సంఘం కమిటీ ఎన్నిక



అధ్యక్షుడు వాసుశర్మ కార్యదర్శి రామారావు

ఖమ్మంగాంధీచౌక్: తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘాల సమాఖ్య జిల్లా కమిటీని ఆదివారం నగరంలోని రామచంద్రయ్య–ఉరువయ్య సత్రంలో ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా సురావజ్ఝల వాసుశర్మ, కార్యదర్శిగా అచ్యుత రామారావు, కోశాధికారిగా మారిగంటి భార్గవాచార్యులు ఎన్నికయ్యారు. నూతన కమిటీ ఎన్నికను సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెనంపల్లి జగన్మోహన్ శర్మ అధికారికంగా ప్రకటించి అభినందించారు. కార్యక్రమ సమన్వయ కర్తలుగా సరస్వతిభట్ల శ్రీధర్ శర్మ, వనం కృష్ణవేణిలు వ్యవహరించగా.. ఎన్నికల అధికారులుగా క్రమశిక్షణ సంఘం అధ్యక్షుడు కిరణ్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభాకర్ శర్మ, మహిళా సంఘం నాయకురాలు వాణి తదితరులు పాల్గొన్నారు.

### ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఖమ్మం మామిళ్లగూడెం: ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వీరాంజనేయులు, ఉపప్రధాన కార్యదర్శి గడ్డం లింగమూర్తి డిమాండ్ చేశారు. ఆదివారం సాయంత్రం కార్మికులను కలుసుకుందాం.. సమస్యలు తెలుసుకుందాం.. కార్యక్రమంలో భాగంగా ఖమ్మం డిపోకు వచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈనెల 16న జరిగే దేశవ్యాప్త సమ్మెలో ఆర్టీసీ కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, రాంబాబు, సుధాకర్, నర్సింహారావు, రోశయ్య, గుండ మాధవరావు, సరిత, మాధవి, రామారావు, రవి, రాములు, వెంకటేశ్, నాగేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

### మహాసభల ఆడియో, వీడియో విడుదల



ఆడియో, వీడియోలను విడుదల చేస్తున్న సంఘ ప్రతినిధులు

ఖమ్మం సహకారనగర్: టీపీటీఎఫ్ రాష్ట్ర ద్వితీయ మహాసభలు ఈ నెల 11, 12వ తేదీల్లో జరగనున్న నేపథ్యాన అందుకు సంబంధించిన ప్రచార ఆడియో, వీడియో పాటలను సంఘం సీనియర్ నాయకుడు, విద్యా పరిరక్షణ కమిటీ గౌరవాధ్యక్షుడు ఆళ్ళనారామారావు, పూర్వ రాష్ట్ర కౌన్సిలర్ రాయల రవికుమార్‌లు విడుదల చేశారు. ఆదివారం నయాబజార్ హైస్కూల్‌లో టీపీటీఎఫ్ సాంస్కృతిక విభాగం ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. సాంస్కృతిక విభాగం కళాకారులైన ఉపాధ్యాయ బృందంతో మహాసభల విజయానికి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏవీ నాగేశ్వరరావు, ఎస్.విజయ్, నాయకులు నాగేశ్వరరావు, రవికుమార్, ప్రసాదరావు, కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### పీడితుల పక్షపాతి ముఖ్దూం మోహినుద్దీన్

ఖమ్మంమయూరిసెంటర్: జీవిత కాలం పీడితుల కోసం పోరాడి, తన కవిత్వంతో నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రజలను మేల్కొల్పిన అమరుడు ముఖ్దూం మోహినుద్దీన్ అని సీపీఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ కొనియాడారు. మోహినుద్దీన్ 116వ జయంతి సందర్భంగా ఆదివారం ఖమ్మంలోని గిరిప్రసాద్‌భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటంలో ప్రముఖ పాత్ర పోషించిన మొహినుద్దీన్ జయంతి, వర్ధంతులను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు షేక్.జానిమియా, శివరామకృష్ణ, తోట రామాంజనేయులు, మందడపు రాణి, జిల్లా సమితి సభ్యులు ఏనుగు గాంధీ, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇటికాల రామకృష్ణ, ఏఐవైఎఫ్ ప్రధాన కార్యదర్శి నానబాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంవ్యవసాయం: నగరంలోని టౌన్–2 బురహాన్‌పురం సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ రామాలయం ఫీడర్ నిర్వహణ పనుల కారణంగా సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఆపరేషన్ ఏఈ నాగేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రామాలయం సెంటర్, బైపాస్ రోడ్, ఓల్డ్ డీఆర్‌డీఏ ప్రాంతం, రవీంద్రనాథ్ ఠాగూర్ రోడ్, బురహాన్ పురం తదితర ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందన్నారు. అలాగే నగరంలోని టౌన్–3 ఇల్లెందు క్రాస్‌రోడ్ సబ్ స్టేషన్ 11 కేవీ వీడీవోస్ కాలనీ ఫీడర్ విద్యుత్ లైన్లకు ఆటంకంగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బ్యాంకు కాలనీ, వీడీవోస్ కాలనీ, గట్టయ్య సెంటర్ ప్రాంతాల్లో విద్యుత సరఫరాకు అంతరాయం ఉంటుందని ఆపరేషన్ ఏఈ తావుర్యా తెలిపారు.

### దివ్యాంగులకు బస్సు సౌకర్యం కల్పించాలి



యుగంధర్‌కు బొకే అందిస్తున్న ఉప్పలయ్య

ఖమ్మం మామిళ్లగూడెం: దివ్యాంగులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని కాంగ్రెస్ అనుబంధ దివ్యాంగుల జిల్లా అధ్యక్షుడు కుంచం ఉప్పలయ్య అన్నారు. ఈమేరకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు తనయుడు యుగంధర్ పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం యుగంధర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపాక వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నూకపోగు కింగ్‌కోటి, షేక్.జాని, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

### అన్నదానం..

ఖమ్మంఅర్బన్, రఘునాథపాలెం: నగరంలోని బల్లేపల్లిలో ఉన్న మదర్‌థెరిస్సా మానసిక వికలాంగుల కేంద్రంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు యుగంధర్ తన జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి దివ్యాంగులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మల్లీదు జగన్, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, కోటేష్, తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని మంచుకొండలో మాజీ సర్పంచ్ కాంగ్రెస్ నాయకుడు వాంకుడోత్ విజయదీపక్ ఆధ్వర్యాన గ్రామ సెంటర్‌లో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. బూడిదంపాడుకు చెందిన చౌహాన్ ఆధ్వర్యంలో యువత రక్తదానం చేశారు.

## 'డబుల్' సముదాయంలో తనిఖీ

సాక్షి ఎఫెక్ట్..

ఖమ్మంఅర్బన్: నగరంలోని 8వ డివిజన్ వైఎస్ఆర్‌నగర్‌లో డబుల్ బెడ్రూం సముదాయంలో ఆదివారం రెవెన్యూ, కార్పొరేషన్ అధికారులు ఇంటింటా తనిఖీలు నిర్వహించారు. ఇటీవల కొంత మంది నివాసులు ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి ద్వారబందాలు, కిటికీలు మార్చడంపై సాక్షిలో 'మళ్లీ మొదలు పెట్టారు..'అనే కథనంపై అధికారులు స్పందించారు. ఆదివారం తహసీల్దార్ స్వామి ఆధ్వర్యాన ఆర్ఐలు రవి, రమేశ్, కార్పొరేషన్ బిల్ కలెక్టర్లు బృందాలుగా ఏర్పడి డబుల్ బెడ్రూం సముదాయంలో లబ్ధిదారులు ఉంటున్నారా.. లేదా అని, నిబంధనలు విరుద్ధంగా నిర్మాణాలు ఏమైనా చేపట్టారా.. తదితర అంశాలపై విచారణ చేపట్టారు. ఇందులో భాగంగా ఈమధ్య కాలంలో నివాసాల్లో ఉండకుండా ఉన్న 8 మందికి నోటీసులు జారీ చేసి వివరణ ఇవ్వాలని ఆదేశాలు పంపారు. నిబంధనలు పాటించని లబ్ధిదారులకు ఇళ్ల పట్టా రద్దు చేసి స్వాధీనం చేసుకుంటుందని హెచ్చరించారు.



తనిఖీ చేస్తున్న తహసీల్దార్ స్వామి, ఆర్ఐలు

### కాపుల్లో రాజకీయ చైతన్యం రావాలి

ఖమ్మం మామిళ్లగూడెం: మున్నూరు కాపుల్లో రాజకీయ చైతన్యం రావాలని ఆర్జేసీ విద్యాసంస్థల అధినేత గుండాల కృష్ణ అన్నారు. ఆదివారం ఖమ్మం ఎంబీగార్డెన్స్‌లో నూతన సంవత్సర డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కాపుల ప్రేరణ ఇతర జిల్లాల వారు అనుసరించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. తొలుత జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. మున్నూరుకాపు ఉద్యోగుల, రిటైర్డు ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పెదబోయిన నాగరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బాల శ్రీనివాస్, సోమయ్య, శ్యామ్‌బాబు, అచ్యుత్, మురళి, అకాపుసంఘ సభ్యులు భిక్షమయ్య, ఆకుల గాంధీ, శెట్టి రంగారావు, వెంకటేశ్వర్లు, నాగేశ్వరావు, శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

### ఎంపీ స్థానానికి దరఖాస్తు

కామేపల్లి: మహబూబాబాద్ పార్లమెంట్ స్థానానికి ఎంపీగా పోటీ చేయడానికి కామేపల్లి మండలం గోవింద్రాల గ్రామానికి చెందిన ఐఎన్‌టీయూసీ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, రిటైర్డ్ న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్ ఉద్యోగి బానోత్ లక్ష్మణ్‌నాయక్ గాంధీ భవన్‌లో తన దరఖాస్తును అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 30 ఏళ్ల నుంచి కాంగ్రెస్ పార్టీకి అనుబంధ సంఘంగా ఉన్న ఐఎన్‌టీయూసీలో కీలకంగా పని చేశానని, పార్టీ తనకు అవకాశం కల్పించాలని కోరినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు చీమల వెంకటేశ్వర్లు, మండల యువజన నాయకుడు మాలోత్ ప్రేమ్‌కుమార్ నాయక్ పాల్గొన్నారు.

### అక్రమ కేసులు ఎత్తివేయాలి



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

కామేపల్లి: ప్రజాపంథా రాష్ట్ర నాయకులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా నాయకుడు కోలేటి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం ఈమేరకు నిరసనగా సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యాన పండితాపురం స్టేజీ వద్ద పోలీసుల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్న ఘర్షణను ఆసరా చేసుకుని పోలీసులు ప్రజాపంథా నాయకులు ఆవుల అశోక్, వుల్లయ్య, హనుమంతరావు, లక్ష్మణ్, నునావత్ శ్రీనులపై కేసులు బనాయించి జైలుకు పంపారన్నారు. ప్రజలకు అండగా ప్రజా సమస్యలపై పోరాడే నాయకులను ఎలా రౌడీలు అవుతారని నిలదీశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్‌వీ రాకేశ్, నాయకులు కేలోత్ లక్ష్మణ్, గుగులోత్ తేజ, ధరావత్ లక్ష్మణ్, భీమిరెడ్డి రాము, వడ్డే వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

### ఉత్తమ సర్పంచ్ అవార్డు గ్రహీతకు సన్మానం

రఘునాథపాలెం: ఉత్తమ పంచాయతీ సర్పంచ్‌గా అవార్డు అందుకున్న మండలంలోని కోటపాడు సర్పంచ్ బాతుల రమణ–సుధాకర్ దంపతులను జిల్లా అఖిల భారత యాదవ మహాసభ సంఘం ఆధ్వర్యాన ఘనంగా సన్మానించారు. ఆదివారం కోటపాడులో జరిగిన ఈ కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ జిల్లా గౌరవాధ్యక్షుడు, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్, జిల్లా అధ్యక్షుడు చిలకల వెంకటనరసయ్య, జిల్లా యువజన అధ్యక్షుడు చిత్తారు సింహాద్రియాదవ్, రాష్ట్ర కార్యదర్శి లోడిలో వెంకన్నలు పాల్గొని సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు తెల్లబోయిన రమణ, బరిగల ఉపేందర్, గొర్రెల సంఘం అధ్యక్షులు చంద్రకాని వెంకన్న, బాతుల మహేశ్, కటారి సతీశ్, జాల చిన్న లింగయ్య, మేడబోయిన రమేశ్, బాతుల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

### ప్రసాద్‌రెడ్డికి ఎంపీ టికెట్ ఇవ్వాలి..

నేలకొండపల్లి: ఖమ్మం ఎంపీ టికెట్‌ను కాంగ్రెస్ అధిష్ఠానం పొంగులేటి ప్రసాద్‌రెడ్డికి ఇవ్వాలని పాలేరు డివిజన్ కాంగ్రెస్ నాయకుడు సూరేపల్లి రామారావు ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. నిత్యం ప్రజల్లో ఉండే పొంగులేటి ప్రసాద్‌రెడ్డికి టికెట్ ఇస్తే ఖమ్మం నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు.

### పంచాయతీ పాలకవర్గానికి సన్మానం



రఘునాథపాలెం: పంచాయతీ పాలకవర్గాన్ని సన్మానిస్తున్న జీకేబంజర గ్రామస్తులు

సర్పంచ్‌ల ఐదేళ్ల పదవీకాలం పూర్తయిన సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులతో పాటు గ్రామస్తులు ఆదివారం సర్పంచ్‌లను ఘనంగా సన్మానించారు. అనంతరం గ్రామాభివృద్ధిలో సర్పంచ్‌లు చేసిన కృషిని పలువురు కొనియాడారు. – సాక్షి నెట్‌వర్క్

## మూగ రోదన..



**కూలిన పశువైద్య భవనం**

- ఐదేళ్లుగా అవస్థలు పడుతున్న వైద్యులు
- పంచాయతీ కార్యాలయంలోనే చికిత్స అందిస్తున్న వైనం
- పట్టించుకోని పాలకులు

రఘునాథపాలెం: గత ఐదేళ్ల క్రితం కూలిన పశువుల భవనాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో మూగజీవాలకు నానా అవస్థల మధ్య వైద్యం అందించాల్సి వస్తోంది. నూతన కలెక్టరేట్‌కు కూత వేటు దూరంలో ఉన్న వీవీపాలెంలో పశువైద్యానికి ప్రత్యేక భవనం లేకపోవడంతో పంచాయతీ కార్యాలయమే దిక్కయింది. 1975 సంవత్సరంలో సీఎం జలగం వెంగళరావు ఆధ్వర్యాన వీవీపాలెంలో పశువైద్యశాల నిర్మించి నాటి నుంచి వీవీపాలెం, వేపకుంట్ల, చెరువు కొమ్ముతండా తదితర గ్రామాల పరిధిలోని వేలాది పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లు తదితర వాటికి వైద్యం అందిస్తున్నారు. కానీ ఆ భవనం కూలి ఐదేళ్లు గడుస్తున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. నూతన భవన నిర్మాణం కోసం గతంలో అనేకసార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. అధికారులను ఎప్పుడు అడిగినా ప్రతిపాదనలను పైఅధికారులకు పంపామని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారు. ఇటీవల మాజీ సర్పంచ్ కాపా ఆదినారాయణ ఆధ్వర్యాన గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును సైతం కలిసి పక్కా భవనం మంజూరు చేయించాలని కోరారు. వీవీపాలెం ఆస్పత్రి పరిధిలో 15 వందలకు పైగా పశువులు, 3 వేల వరకు గొర్రెలు, 2 వేలపైగా మేకలు, కోళ్లు తదితర మూగ జీవాలు ఉన్నాయి. ఇకనైనా తమ బాధను ఆలకించి వసతులతో కూడిన భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరుతున్నారు.



కూలిన చోటే వైద్యం అందించేందుకు ఏర్పాటు చేసిన స్టాండ్



**వైద్యం చేయాల్సిందేగా..**



గత కొన్నేళ్లుగా పంచాయతీ కార్యాలయంలో ఒక గదిలో మందులు నిల్వ ఉంచుకొని పశువులకు వైద్యం అందిస్తున్నాం. కూలిన భవనం ప్రాంగణంలోనే వైద్యం అందిస్తున్నాం. ఒక చోట వైద్యం, మరోచోట నిల్వ ఉంచడం చాలా ఇబ్బందిగా ఉన్నా.. వైద్యం చేయక తప్పదు కదా.

– ఎస్.వెంకటేశ్వర్లు, జూనియర్ వెటర్నరీ డాక్టర్

**పశువులకు వైద్యమే కష్టం..**



పశువులకు వైద్యం అందించడమే కష్టంతో కూడుకుంది. అలాంటి పరిస్థితిలో వైద్యం అందించడానికి సరైన వసరులు లేకుండా మూగ జీవాలకు వైద్యం అందించాలంటే యాతన అవుతుంది. తక్షణం నూతన భవనం నిర్మాణం చేపట్టి మౌలిక వసతులు కల్పించి జీవాలను రక్షించాలి.

– ఆళ్ల రామారావు, గొర్రెల పెంపకందారుడు